క్లుప్తంగా

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



కోపల్లె హైస్కూల్‌లో మాట్లాడుతున్న దిశ ఎస్సై జయలక్ష్మి

కాళ్ల: ఫోన్ ట్యాపరింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన యాప్స్ ఉపయోగించొద్దని భీమవరం దిశ పోలీస్ స్టేషన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి హెచ్చరించారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ డే ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ చైల్డ్ అబ్యూస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ ఎస్సై జయలక్ష్మి టెక్నాలజీ ఉపయోగించి మహిళలు, విద్యార్థినులను ఎలా ట్రాప్ చేస్తున్నారో వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ పి.భువనేశ్వరి మాట్లాడుతూ కోపల్లె హైస్కూల్‌ను దత్తత తీసుకొని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై జయలక్ష్మిని సత్కరించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి



కాళ్ల సచివాలయ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

కాళ్ల: మండలంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎ.వెంకట అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న 69 ఇళ్ల పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి వద్దా ఇంకుడు గుంటలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కాళ్ల సచివాలయం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కరరావు, హౌసింగ్ ఏఈ ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 46 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బాబు విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 17, 18 తేదీలో విప్రో కావాసాకి సంస్థ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించగా ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు మంచి మార్కులతో డిగ్రీ పట్టా ఒక్కటే కాకుండా భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, ఆధునిక సాఫ్ట్‌వేర్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సీహెచ్ రాంకిషోర్, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి కేవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు, చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

భీమవరం: ఉద్యోగులంతా ప్రభుత్వ పథకాలు, పంచాయతీ చట్టాలపై అవగాహన కలిగి ప్రజలకు మంచి సేవలు అందించాలని జిల్లా పంచాయతీ శాఖ అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. శనివారం భీమవరం విష్ణు కళాశాలలో పంచాయతీ సంస్థల బలోపేతంపై డివిజనల్ పంచాయతీ అధికారులు, ఈవోపీఆర్డీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆయన మాట్లాడారు. పంచాయతీల ఆదాయం మరింత పెంచేందుకు కృషిచేయాలన్నారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన జీవనోపాధి, జనాభా సమతుల్యత అంశాలపై ఈనెల 27 నుంచి డిసెంబరు 10 వరకు జిల్లాలో కులగణన నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సీహెచ్ బాలాజీ వెంకట రమణ, నరసాపురం ఇన్‌చార్జి డివిజనల్ పంచాయతీ అధికారి యూఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



శ్రీసీతారాముల కల్యాణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



అన్నదానికి సమర్పించిన బియ్యానికి పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్) : హిందూ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్య రథయాత్ర శనివారం భీమవరం వచ్చింది. స్థానిక దంతులూరి జగన్నథరాజు సత్రం అనుబంధ సంస్థ పద్మావతి, వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భద్రాద్రి రామయ్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీనివాస్‌కు తొలుత భద్రాచలం ఆలయ ఈఓ అనుపోజుల రమాదేవి స్వాగతం పలికి శేషావస్త్రంతో సత్కరించారు. భద్రచలం రామయ్య ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, ఆలయ ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవీ, దేవస్థాన చైర్మన్ మంతెనరామ్‌కుమార్ రాజు, పాలకవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, లక్ష్మీపతి రాజు, శ్రీనివాసరాజు, స్వామి, సాయిబాబు, నాయకులు ఏఎస్ రాజు, మానేపల్లి నాగన్నబాబు, రేవూరి గోగురాజు, కొప్పర్తి వీర రాఘవులు, ఏఎస్ రాజు, తిరుమాని ధనుంజయ, కోళ్ల బాలకృష్ణ, కొట్టి కుటుంబరావు, కొమటి రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, అర్చకులు పాల్గొన్నారు.

100 క్వింటాళ్ల బియ్యం అందజేత

పంచారామక్షేత్రంలో కొలువైన అన్నపూర్ణమ్మవారికి ఇష్టమైన ఈ కార్తీక మాసంలో మొక్కు తీర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. కార్తీకమాసం నెల రోజులూ భక్తులకు నిత్యాన్నదానానికి శనివారం ఆయన 100 క్వింటాళ్ల సోనా మసూరి బియ్యం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తొలిసారి ఎమ్మెల్యేగా పని చేసిన తరువాత ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌కు తోడుగా తమ కుటుంబ సభ్యులు మరో రూ.లక్ష కలిపి అన్నపూర్ణాదేవికి ఏటా బియ్యం రూపంలో మొక్కుబడి చెల్లించుకుంటున్నట్టు చెప్పారు. మహానైవేద్యానికి బియ్యం అందిస్తామని తెలిపారు. శివయ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నట్టు ఎమ్మెల్యే శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్, యువ నాయకులు గ్రంధి రవితేజను ఆలయ అధికారులు, ధర్మకర్తలు ఘనంగా సత్కరించారు. వేదాఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, పాలకవర్గ సభ్యులు నాచు శ్రీవల్లి, చెల్లబోయిన సూర్య ప్రకాష్, కూర్మాదాసు సత్య శ్రీనివాస్, నల్లం రఘు, కోయ తాతాజీ, లక్కు త్రిమూర్తులు, నాయకులు గూడురి ఉమా బాల, కోడే యుగంధర్, నందమూరి ఆంజనేయులు, నల్లం రాంబాబు, మానేపల్లి నాగన్న బాబు, కొట్టి కుటుంబరావు, మద్దాల సత్యనారాయణ, మాదాసు రంగబాబు, చెల్లంకి గిరి, నాగిడి నారాయణస్వామి, కోమటి రాంబాబు, గంటా సుందర్‌కుమార్, కట్టా రవి, అల్లూరి నాగవల్లి, వేంద్ర దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉణుదుర్రులో మంత్రి కారుమూరి పర్యటన

ఉండి: పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు వెంకటనాగేశ్వరరావు ఆదివారం ఉండి మండలం ఉణుదుర్రులో ఆయన పర్యటించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

స్వామిత్వ సర్వేతో భూ రికార్డులు పదిలం

పాలకొల్లు అర్బన్: స్వామిత్వ సర్వే ద్వారా ప్రతీ ఒక్కరి భూమి రికార్డులు ఆన్‌లైన్‌లో పదిలంగా ఉంటాయని, వ్యక్తుల మధ్య భూ తగాదాలకు తావుండదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. పాలకొల్లు మండలం యాళవానిగరువు సచివాలయంలో శనివారం స్వామిత్వ సర్వే బృందం గృహాలను సర్వే చేసి లబ్ధిదారులకు భూ హక్కు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందప్రకాష్ తన ఇంటి వివరాలను సర్వే టీమ్‌కి తెలియజేసి భూ హక్కు సర్వే పత్రాన్ని తీసుకున్నారు. ప్రతీ ఒక్కరూ సర్వే టీమ్‌కి సహకరించి వారి భూమి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచుకోవాలని కోరారు. సర్వే టీమ్ కె.ప్రశాంత్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్.రవితేజ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



కాళ్ల : మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు



ఉండి : మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

కాళ్ల: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథరాజు అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో కుల గణన కార్యక్రమం నిర్వహించినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర రావు తెలిపారు. ఆటాడుదాం ఏపీ కార్యక్రమంలో యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దాళ్వాలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ అధికారి జయవాసుకి తెలిపారు. మండలంలో జగనన్న కాలనీలకు ఆరు లేఔట్‌లో విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్టు ఏఈ రాంబాబు తెలిపారు. తాగునీటి సదుపాయం కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 352 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశామని, 32 మందికి కంటి ఆపరేషన్లు చేశామని డాక్టర్ సునీల్ వివరించారు. గ్రామాల వారిగా లెప్రసీ సర్వే చేస్తున్నామన్నారు. రానున్న దాళ్వా కు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంట కాలువలు అభివృద్ధి చేయాలని పలువురు నాయకులు కోరారు. సమావేశంలో జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, తహసీల్దార్ కృష్ణారావు, వైస్ ఎంపీపీ సరాబు పద్మారాణి, పెనుమత్స విశ్వనాథరాజు, చిన్నాపరపు రాంబాబు, వేగేశ్న సూర్యనారాయణరాజు, అధికారులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కరించాలి

ఉండి: ప్రజలు ఫిర్యాదు చేయకముందే ఆయా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంపీపీ ఇందుకూరు శ్రీహరినారాయణరాజు అధికారులను కోరారు. శనివారం ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాని ఆయన అధ్యక్షత వహించి ఆయా శాఖల పనితీరుపై, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. అధికారులంతా విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాలను సక్రమంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు ఇవ్వడంలో ఇరిగేషన్ శాఖ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉండిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించి అందరికీ విద్య అందించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దత్తాల సుజాతారాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి

భీమవరం: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఆదివారం మధ్యాహ్నం భారత్ ఆస్ట్రేలియా మధ్య జరిగే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్ తిలకించేందుకు జిల్లా వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో భారీ స్క్రీన్స్ ఏర్పాటు చేసి ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు సన్నద్ధమయ్యారు. భీమవరం, ఆకివీడు, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాలతోపాటు గ్రామాల్లో సైతం క్రికెట్ అభిమానులు భారీ స్క్రీన్స్ ఏర్పాటుతోపాటు మ్యాచ్ తిలకించేందుకు వచ్చే క్రీడాభిమానులకు అల్పాహారం, టీ, కూల్‌డ్రింక్స్ వంటి అందించేందుకు చర్యలు చేపట్టారు.

జోరుగా పందాలు

ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌పై జిల్లాలో జోరుగా పందాలు సాగుతున్నట్టు సమాచారం. భారత్ ఫైనల్ మ్యాచ్‌లో కూడా విజయదుందుభి మోగిస్తుందనే నమ్మకంతో అనేకమంది పందాలకు సిద్ధమయ్యారు. పెద్దపెద్ద భవనాలు, చేపలు, రొయ్యల చెరువుల వద్ద బెటింగ్‌రాయుళ్లు ఆన్‌లైన్ పందాలకు సిద్ధం చేసుకున్నట్టు చెబుతున్నారు.

అనుమతులు లేవు

ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు బహిరంగ ప్రదేశాల్లో భారీ స్క్రీన్స్ ఏర్పాటుకు అనుమతులు లేవని ఎస్పీ రవిప్రకాష్ తెలిపారు. భారీ స్క్రీన్స్ ఏర్పాటు వల్ల శాంతి భద్రత సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు.

ఆకివీడులో రైల్వేస్టేషన్ వద్ద లైవ్ మ్యాచ్

ఆకివీడు: వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ బిగ్ స్క్రీన్‌పై క్రీడాభిమానులు తిలకించేలా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఆకివీడు రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసినట్టు ఆకివీడు పట్టణాధ్యక్షుడు గుండా సుందర రామినాయుడు తెలిపారు. ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరిగే వరల్డ్ కప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ మధ్యాహ్నం రెండు గంటల నుంచి బిగ్ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారాన్ని క్రీడాభిమానులంతా తిలకించాలని ఆయన కోరారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

పెనుమంత్ర: మార్టేరు శ్రీఅయ్యప్పస్వామి సేవా పీఠం ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామివారిని అశ్వరథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయం నుంచి అడబాల శ్రీనివాస్ వెంకటరమాప్రభ దంపతులు ఈ రథోత్సవాన్ని ప్రారంభించగా మేళతాళాలు, గరగనృత్యాలతో నెగ్గిపూడి, మార్టేరు, వెలగలేరు, వనుంపల్లి గ్రామాల మీదుగా సాయంత్రం తిరిగి అయ్యప్ప దేవాలయం వరకూ సాగింది. గురుస్వామి మల్లిడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పేటతుళ్ల గ్రామోత్సవ కార్యక్రమంలో వెలగలేరు సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి, తమనంపూడి విజయారెడ్డి, చిర్ల శ్యామ్‌సుందరరెడ్డి, మేడపాటి చిన్నారెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, నెగ్గిపూడి సర్పంచ్ అల్లం సాయిరెడ్డి, 150 మందికి పైగా మాలధారులు పాల్గొన్నారు.

పిల్లలను గ్రంథాలయాలకు అలవాటు చేయాలి



భీమవరంలో పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు



యండగండిలో విజేతలతో నిర్వహకులు

భీమవరం: పిల్లలను బాల్యం నుంచే గ్రంథాలయాలకు అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయం వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలోని మేధావులంతా గ్రంథాలయాలను ఉపయోగించుకున్నవారేనని, గ్రంథాలయాల ద్వారా జ్ఞానసంపద కలుగుతుందని వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వెంకట రమణారావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సుంకర దాసు, ఉండపల్లి రమేష్ నాయుడు, కరుణాకరరావు, అడగర్ల ప్రభాకర గాంధీ, కలిగొట్ల గోపాల శర్మ, కె.పద్మ, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై పోటీలు

ఉండి: శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం యండగండిలో దిశా చట్టంపై డిబేట్ నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. రూరల్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్, పలువురు మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ మహిళల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. దిశ చట్టం మహిళల పాలిట రక్షణ అస్త్రమన్నారు. మహిళా పోలీస్ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు రమణ, పి.మమత, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఉండి జెడ్పీ హైస్కూల్‌లో దిశ చట్టం, సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీనేజ్ బాలికల్లో వచ్చే మార్పులపైనా వివరించారు. హెచ్ఎం వై.రామలక్ష్మి, మహిళ పోలీసులు ఎం కుమారి, ఎస్ వాహిని, ఎండీ ఫాతిమా, వై రేవతి, లైబ్రేరియన్ జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యం, పర్యావరణానికి ప్రాధాన్యత

ఆకివీడు: లయన్స్ విద్య, ఆరోగ్య, పర్యావరణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు తెలిపారు. అధికార పర్యటనలో భాగంగా శనివారం ఆయన స్థానిక జానకమ్మ ఆసుపత్రిలో ఆదర్శ లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. శాఖా గ్రంథాలయంలో ఎలక్ట్రికల్ ఇన్వెర్టర్, సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో యోగా దుస్తులు పంపిణీ చేశారు. ఆదర్శ లయన్స్ కైలాస నిలయాన్ని సందర్శించారు. సిద్ధాపురంలో పశువుల ఆసుపత్రి, దుంపగడపలో మెడికల్ కమ్యూనిటీ హాలు, జూనియర్‌కాలేజీలో వాటర్ ప్లాంట్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. నా మొక్క - నాశ్వాస కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఎండీ సుఫీఖాదరీకి ఎంజేఎఫ్ ఫ్లాగ్ బహూకరించారు. యోగా కేంద్రంలో యోగా గురువుల్ని సత్కరించారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఎంవీ సూర్యనారాయణరాజు, ఆదర్శ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మోటుపల్లి శ్రీనివాసరావు, ముక్తుమ్ షరీఫ్, కోశాధికారి అనిల్‌కుమార్, అభయ క్లబ్ అధ్యక్షుడు ఎండీ జక్కీ, నేరెళ్ల రామ చెంచయ్య, గొంట్ల కృష్ణమూర్తి, ఓలేటి శ్రీను, పుప్పాల పండు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అసత్య ప్రచారాన్ని తిప్పికొడతాం



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: దళితులకు వైఎస్సార్ సీపీ అన్యాయం చేస్తుందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యప్రచారాన్ని తిప్పికొడతామని, దీనిలో భాగంగా భీమవరంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ, జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు, పొన్నమండ బాలకృష్ణ శనివారం విలేకర్లకు చెప్పారు. శనివారం వారు భీమవరంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని బీవీ రాజు పార్కు సెంటర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో దళితులపై అధికంగా దాడులు జరిగినా స్పందించని నాయకులు అభూతకల్పనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా దళిత బహుజనులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయంపై చర్చిస్తామని కిషోర్‌మాదిగ మంగరాజు, బాలకృష్ణ తెలిపారు.

టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

లింగపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో టెన్నికాయిట్ అండర్-14, అండర్-17 బాలురు, విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు కె.గోకవరంలో శనివారం నిర్వహించారు. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 120 మంది క్రీడాకారులు హాజరు కాగా, ఒక్కొక్క విభాగం నుంచి ఐదుగురు చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశామని, వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. క్రీడాకారుల వివరాలను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.